# పరివర్తన

రచన:
రామవరపు గణేశ్వరరావు

"ఏయ్ టాక్సీ!" అని పిలిచాడతను.

టాక్సీ రాలేదు.

అతను టాక్సీదగ్గరికి వెళ్ళాడు. డ్రైవరు రాము భుజంమీద తట్టాడు.

"పిలుస్తుంటే వినబడటంలేదా మిస్టర్?" అంటూ బేక్ డోరు తీసుకొని టాక్సీలోపల కూర్చుని 'పోనీ' అన్నాడు.

రామూ వెనక్కితిరిగి చూశాడు. తనలాగే కండలుతిరిగిన మనిషి. ఒడ్డూ, పొడుగులో తనకేమీ తీసిపోడు. కాని ఎటొచ్చీ వేషధారణ లోనే—తనదేమో అందరు టాక్సీడ్రైవరులు వేసే కాకీయూనిఫారమ్. అతనిది ఉలెన్ సూటు—హేట్, నల్లకళ్ళద్దాలు ధరించాడు.

"క్షమించండి సార్! నాకు వేరేపని వుంది. సిగరెట్టుకోసం కుర్రవాణ్ణి పంపబట్టి వున్నాను. టాక్సీ కట్టలేను, ఇంకోటి చూసుకోండి" వినయంగా అన్నాడు.

ఇంకో టాక్సీవుందేమో పిలుద్దామని చుట్టూ చూసాడు. కాని టాక్సీ లెక్కడాలేవు. రోడ్డు ఇంచుమించూ నిర్మానుష్యంగా వుంది.

"చూశావా! ఎక్కడాటాక్సీల్లేవు. నువ్వెంత డబ్బు కావాలంటే అంతయిస్తాను. ఎలాగేనా నన్ను తీసుకెళ్ళు."

రాము మాట్లాడలేదు.

"చూడు! మిస్టర్! అదుగో ఆ కనిపిస్తున్న బిల్డింగే మా ఆఫీసు. ఇప్పుడే నా భార్య చావు బ్రతుకుల్లో ఉందని, వెంటనే రమ్మని మా ఫేమిలీడాక్టరు ఫోనుచేశాడు. నాకు పెళ్లయి ఇంకా ఆరు నెలలేనా అవ్వలేదు. ఇంతలోనే నా భార్యకా మాయరోగం దాపురించింది. ఇప్పుడెలావుందో! ఏమిటో! నే నెంత త్వరగా వెళితే అంత మంచిది. నాభార్య కడసారి చూపేనా నాకు...." అతనిగొంతు బొంగురు పోయింది. జేబురుమాలుతీసి కళ్ళనీళ్లు వత్తుకొన్నాడు.

కుర్రాడు సిగరెట్లు తీసుకొచ్చి రామూ కిచ్చాడు.

"ఫరవాలేదులెండి! నేనూ ఒక అత్యవసరమైన పనిమీద వెళ్తుండబట్టి అలాగన్నాను. ఆ! ఇంతకి ఎక్కడకి పోనిమ్మన్నారు?" సిగరెట్టు ముట్టిస్తూ అన్నాడు.

"మిస్టర్...." అతను ఏదో అనబోయాడు

"రాము" నవ్వుతూ అన్నాడు రాము.

"ఆ! మిస్టర్ రాము! ఇంకొక్కమాట. ఇందాకే చెప్పానుగా! నేనెంత వేగం ఇంటికి వెళ్తే అంత మంచిదని. నాకు కారుడ్రైవింగు బాగా తెలుసు. నా అంతవేగంగా కారు నడపగలిగేవాడు ఇండియాలోనేవుండడని ఛాలెంజీ చెయ్యగలను. కనుక నువ్వు ప్రక్కసీట్లో కూర్చుంటే నేనే నడుపుతాను. ఏదో! నా ఆతురత నాది" అని అతనన్నాడు.

రాము అతనిమాటలకు తనలో తనే నవ్వుకొన్నాడు. ఏదో ఆదరకం మనిషి — సరే లెమ్మని అనుకొని ప్రక్కకి జరిగాడు. కారు 60—70 మైళ్ళ స్పీడందుకుంది. ఎవడో గట్టివాడేనని అనుకున్నాడు రాము కారు టౌను లిమిట్సు దాటిపోయింది. కారు ఎటు వెళ్లిందో రాముకే అర్థమవలేదు. ఎక్కడా ఒక్కపిట్టకూడా లేదు. రాముకి సందేహం వచ్చింది.

"సార్! మీ ఇల్లెక్కడ? ఇంకా ఎంతదూరం వుంది! ' అని అడిగాడు.

"ఇదో వచ్చేసాం! అదో! కనిపిస్తోందే ఆతోట ఆ దగ్గరేలే!" అన్నాడతను

కారు మలుపుతిరిగింది. చెట్లమధ్యగుండా వున్న ఆ చిన్నరోడ్డుమీద బల్లిలా పరిగెత్తి అక్కడున్న చెరువు ముందాగింది.

"ఊ! దిగు! రామూ!" డోరుతీసుకొని బయటకువస్తూ అన్నాడు. రాము కారు దిగి చుట్టూ చూసాడు. ఏముంది ? — జుట్టు విరబోసుకున్న రాకసిల్లాగున్న పెద్ద చెట్లు, తుప్పలు, డొంకలు—వాటిమధ్య చెరువు — రామూకి కొంచెం భయంవేసింది. బయటికి మాత్రం గంభీరంగా వుండడానికి ప్రయత్నించాడు.

"సార్! నా టాక్సీ మీటరుచార్జి యివ్వండి నే నిక పోతాను. ఇప్పటికే చాలా ఆలస్యమయింది" మామూలుగా అడిగాడు. అతను సినిమా విలన్‌లాగ నవ్వాడు. జేబులోంచి సిగరెట్టుతీసి వెలిగించాడు.

"నాగు!" అనే పేరు విన్నావా ?

"ఎవడూ! నాగా! ఎన్నో దొంగతనాలు, దోపిడీలుచేసి ఆంధ్రరాష్ట్రాన్నే గడగడలాడించి చివరకి పోలీసులకు దొరికిపోయిన నాగేనా ? ఆ! అతడీమధ్య విజయవాడ సెంట్రల్‌జైలు నుంచి తప్పించుకున్నాడని విన్నాను" రాము అన్నాడు. అతని సందేహం తీరిపోయింది. నిస్సందేహంగా తనముందర ఆనాగేవున్నాడు. అయినా తనేమీ అందరిలా భయపడనక్కరలేదు. తనకూ భగవంతుడు మంచి దేహబలాన్ని, బుద్ధిబలాన్ని యిచ్చాడు. అయినా గుండె బిదుకు బితుకుమంటూనేవుంది.

"ఆ! ఆ నాగూను నేనే" చటుక్కున జేబులోంచి దివాల్వరుతీసి రామూ గుండెలకి గురిపెట్టాడు.

"నీదగ్గరున్నడబ్బు పదివేలు యిస్తావా లేక నన్నే తీసుకోమన్నావా?" నవ్వుతూ అన్నాడు.

ఈహఠాత్సంఘటనకి రామూతట్టుకొన్నాడు.

"డబ్బా! అందులో పదివేలా! టాక్సీడ్రైవర్ని నాకెక్కడొస్తుంది. నీలా నేనేమి దొంగతనాలు చేయలేదే అంత నాదగ్గరుండడానికి" పరిహాసంగా అన్నాడు.

"పిచ్చిమాటలు నా దగ్గరాడబోకు! నువ్వు ఓరియంటల్ టాక్సీ సర్వీస్‌లో పనిచేస్తున్న సంగతి, నీమీద ప్రొప్రయిటర్ హీరాలాల్ కున్న నమ్మకము నాకు తెలుసు. అతను అప్పుడప్పుడు డబ్బును నీచేత బేంకులో కట్టిస్తున్న సంగతీ నాకు తెలుసు. ఇవాళుదయం హీరాలాల్ నీకు పది వేల రూపాయలిచ్చి బేంకులో కట్టమన్నప్పుడు నే నా దగ్గర్లోనే వున్నాను. నువ్వది గమనించలేదు. నువ్వా డబ్బును టూల్సుబేగ్‌లో పెట్టినసంగతి కూడా తెలుసు!"

ఆ! ఇప్పటికే చాలా ఆలస్యమయింది. నేనే తీసుకొంటానులే! నీ కా శ్రమకూడా ఎందుకు అని కారులోవున్న టూల్సుబేగ్‌ను డోర్ విండోలోంచి తీయబోయాడు.

ఇదే అదననుకొని రాము పిస్తోలుని ఆరు గజాలు దూరం వెళ్ళి పడేటట్టు తన బూటు కాలితో తన్నాడు. అతనితో కలియబడ్డాడు.

ఇద్దరూ సమానబలవంతులే. కాని ఇలాటి వాటిలో అనుభవంకల నాగు దే పైచెయ్యి అయింది. రాముని పైకెత్తి గట్టిగా దవడమీద కొట్టాడు. ఆ దెబ్బకి రామూ వెళ్లి ఒక పెద్ద

రాయిమీద పడ్డాడు. చాలా బలమైన గాయం తగిలింది. రక్తస్రావం విపరీతంగా వుంది. రాము లేవడానికి ప్రయత్నించి విఫలుడయ్యాడు. కళ్ళు చీకట్లుకమ్మాయి, శరీరం తన స్వాధీనంలోలేదు. తన అంతిమక్షణాలు సమీపించాయనుకున్నాడు.

"నాగూ! ఒకమాట!" నీరసంగా అన్నాడు.

"ఏం! రోగం కట్టిందా! లేని పోని వేషాలు వేసి అనుభవిస్తున్నావు. ఊ! చెప్పు?" టూల్స్ బేగ్ ఒకచేతితో పట్టుకొని ఇంకో చేతితో కారు డోర్ తీస్తు అన్నాడు.

"నాగూ! నాగురించి నేనేమీవిచారించటం లేదు. ఈ లోకంలో ఉండి నేను సాధించేదేమీలేదు. కాని నాకున్న విచారమల్లా మా అమ్మగురించే! నేను మా అమ్మకి ఒక్కడినే! నేనంటే అమ్మకి ఎంత ప్రేమ? ప్రాణం! నేను చనిపోయానని తెలిస్తే ఆమె నిజంగా గుండె పగిలి చస్తుంది" రాముకళ్ళు చెమ్మగిల్లాయి. రక్తస్రావం ఇంకా యెక్కువయింది. అతని కళ్లలోని కాంతి అస్తమయసూర్యుని కాంతిలా వుంది. ఆయాసంతో మాట్లాడలేక ఆగాడు.

నాగు చెక్కుచెదరలేదు! బాధపడలేదు! కనీసం సానుభూతేనా చూపలేదు. నవ్వుతూ "నువ్వొక్కడివే కొడుకవడంవల్ల మీ అమ్మని పోషించేవాయండరని భయపడుతున్నావా? ఫరవాలేదులే! నేను ఎంతో కొంత మీ అమ్మ కందజేస్తానులే! మీ అమ్మ అంతిమదినాలలో అది సరిపోతుంది" అన్నాడు.

"నీ కంత ధయ, ధర్మంకూడానా! నీకంత జాలి కూడానా? నువ్వొక హంతకుడివి, కిరాతకుడివి, రాక్షసుడివి" ఒగరుస్తు అన్నాడు.

"ఊ! ఇంకా!" తిరిగి నాగూ నవ్వు చెట్ల మధ్య ప్రతిధ్వనించింది.

"ఊ! నవ్వు! నీకు మాతృప్రేమ తెలిస్తే ఇలా అనివుండవు. అవును! నీ కెలా తెలుస్తుందిలే! రాతిగుండె కలవాడివి. నీ కొక్కటే తెలుసు. అదే డబ్బు! వెధవడబ్బు! అదే నిన్నీ స్థితికి తీసుకొచ్చింది. మా అమ్మని నేను పోషించవలసిన అగత్యం, నీడబ్బు తీసుకొనే అగత్యంలేదు. మాకు చాలా యిళ్లున్నాయి. వాటి అద్దె ఆమెకు చాలు! మా అమ్మకి డబ్బు కొదవలేదు! కాని ప్రేమ? నేకొక్కడినే ఆమెకి కొడుకుని. నన్నుచూడనిక్షణమేనా వుండలేని మా అమ్మ నేను చనిపోయానని తెలిస్తే ఈ వృద్ధాప్యంలో ఆమె చిత్తం ఎంత క్షోభిస్తుందో! అసలు ఆమె బ్రతకదు. నాగూ! నాది ఒక్క కోరిక........నువ్వు మాతృప్రేమను ఏమాత్రం అర్థంచేసికోలేవు. అయినా నా స్థితి చూసేనా నీకేమేనా జాలికలిగితే చిన్న ఉపకారం చేసి పెట్టు. నేను చనిపోయినతర్వాత నా శవాన్ని మాత్రం కనిపించనియ్యకు! ఎక్కడైనాపూడ్చి పెట్టెయ్, లేదా ఎవరూ చూడని స్థలాల్లో పడెయ్యి! మా అమ్మకిమాత్రం నా విషయం తెలియకూడదు! నే నెక్కడికో పారిపోయానని తిట్టి, తిట్టి కొన్నాళ్లకు ఊరుకొంటుంది.

ఆమె మనసు నా చావుకి బాధపడినంతగా బాధపడదు. ఆమెకు సంతృప్తి వుంటుంది! తన కొడుకెక్కడో క్షేమంగా ఉన్నాడని. నాకాత్మసంతృప్తి వుంటుంది. నీ తల్లిపై నీకే మాత్రమైనా ప్రేమవుంటే ఈ చిన్న సహాయం చేసిపెట్టు. ఊ! చేస్తావుకదూ!" నాగూ కళ్ళలోకి దీనంగా చూసాడు, అతని రెప్పలు బరువుగా వాలాయి. స్పృహతప్పిపోయాడు.

రాము ఆఖరిమాటలు నాగూ హృదయాన్ని కదిల్చేసాయి. ఔను! తనకీ తల్లిప్రేమ ఎటువంటిదో తెలుసు! తనకీ తల్లి వుండేది! తన్ని లాలించి, పాలించే తల్లి! తనూ తన తల్లికి ఒక్కడేకొడుకు! కళ్లకుకట్టినట్టుగా అతనిచిన్ననాటి స్మృతులన్నీ మనస్సులో మెదిలాయి.

తనకు బాగా జ్ఞాపకం! అమ్మ తన ఒంటిమీద ఈగనేనా వాలనిచ్చేదికాదు. తను ఇరుగుపొరుగిళ్లలో అల్లరిచేసినప్పుడు, అది తెలిసికూడా, తనని సమర్థించి, ఇరుగుపొరుగులతో పోట్లాటపెట్టుకొనేది. తనని చదివించడంకోసం ఎంత కష్టపడేది? తనకోసం రాళ్లెత్తేది గుళ్ళుమోసేది, తనకోసం చేయని పనంటూలేదు. తనకోనాడు తీవ్రమైన జ్వరం వచ్చింది. అప్పుడు అమ్మ ఎంత భయపడిందని? నిద్రాహారాలు లేకుండా తననిచూసింది కాపాడింది. తన అమ్మ చనిపోవడం బాగా గుర్తుంది! చనిపోయేముందు ఎంత బాధపడింది, ఆమెకోసం కాదు—తనకోసం ఎంత విలపించింది? తనకోసం తన భవిష్యత్తుకోసం. అంతిమక్షణాలలో తనని జాగ్రత్తగా చదువుకొనమని గొప్పవాడివి కమ్మని దీవించి కళ్ళుమూసింది. అటువంటి అమ్మ తనకి లభిస్తుందా? మాతృప్రేమ ఎంత గొప్పది.

నాగు ఊహాలోకంలోంచి బయటపడ్డాడు. అతనిలో ఎంతో మార్పువచ్చింది. ఇప్పుడేమిటి చేయడం! తన కర్తవ్యం ఏమిటి? ఆలోచించడానికి వ్యవధిలేదు, ఇప్పుడే ఆస్పత్రికి తీసికెళ్ళి తగిన ట్రీటుమెంటు యిస్తే రామూకి ఫరవాలేదు. కానీ తన సంగతి? ఇంతకుముందు జైలునుంచి తప్పించుకున్న నేరం ఒకటి. ఇప్పుడు తను చేయబోయిన నేరం యింకొకటి. కనీసం ఐదు సంవత్సరాల కారాగారవాసశిక్ష పడుతుందేమో! అంత గజదొంగ నాగూకుకూడా ఆ సమయంలో భయంవేసి ముచ్చెమటలు పోసాయి. ఆలోచించాడు తీవ్రంగా ఆలోచించి ఒక స్థిరనిశ్చయానికి వచ్చేడు. తనేమైపోతేనేం! ఇద్దరి క్షేమం ముందు తన క్షేమం విలువైనదికాదు.

గబగబా కారులోపలున్నదస్టరుతీసి చెరువు నీటిలో గాయంకడిగి డస్టరుక్లాతుతో గట్టిగా కట్టాడు. కారు తిరిగి ముందుకన్న ఎక్కువ స్పీడు నందుకొంది. టౌను చివరినేవున్న సరోజా నర్సింగ్‌హోము ముందాగింది. లోపలికి చూసాడు. డాక్టరు, కంపౌండరు ఏదో ఆఫీసు ఎకౌంట్సు చూసుకుంటున్నారు.

నాగు లోపలికి ప్రవేశించాడు "డాక్టర్! ఒక అర్జెంటుకేసు ప్లీజ్! మీరు వెంటనే తీసుకోవాలి" ఒగురుస్తు అన్నాడు.

డాక్టర్ కంపౌండరు ఏదో పనిచేస్తున్న వారల్లా ఈమాటలకి తలెత్తిచూసారు. నాగూ ఫోటో పేపర్లో ఇంతకుముందే చూసివుండడం వల్ల అతన్ని గుర్తుపట్టారు. ఇద్దరికి చెమటలు పోసాయి.

"ఇదుగో మిస్టర్ నాగూ! ఏదో నాది చిన్న ఆస్పత్రి, అసలే ఊరుచివరనుంది. పేషంట్లు తక్కువ, పిల్లలుగలవాడిని. నా దగ్గరేముంటుంది? చెప్పు" గజగజా వణుకుతూ అన్నాడు డాక్టరు.

క్షమించండి! నేను మునుపటి దొంగను కాను, దొంగతనానికి రాలేదు, కారులో నా మిత్రుడు, మార్గదర్శి చావుబ్రతుకులమధ్య వున్నాడు. అతనికి సరియైన ట్రీటుమెంటు యియ్యండి! అతని ప్రాణాన్ని కాపాడండి" అంటూ డాక్టరు రెండుచేతులూ పట్టుకొని బ్రతిమాలుతూ అన్నాడు. డాక్టరు, కంపౌండరు కారువేపు నడిచారు అతన్ని తీసుకరావడానికి.

రాము సరోజ నర్సింగ్‌హోములో కోలుకున్నాడు. పూర్తి ఆరోగ్యవంతుడయ్యాడు. అదేసమయానికి నాగూకి సంవత్సరం కారాగారవాసశిక్షపడింది. అదే అతని జీవితంలో ఆఖరిశిక్ష. ఈసారి పోలీసులు నాగూని పట్టుకోలేదు! నాగే పోలీసులకి దొరకిపోయాడు. ★